కథలు :

# గొల్లకథ

కె. రాంమోహన్‌రాజు

అయ్యా, గొల్లోనుండ్రి బాంచెను, నా పేరు బుచ్చయ్యగని నన్నంత బుచ్చిగాడంటరుండ్రి. నేను గిప్పుడు కథ్జెపుతనయ్యా.

పోయిన వైశాకమాసంకెల్లే నాయాల్దానికి పెయిబాగులేకుంట ఉండుకచ్చింది.

జెష్టమాసంవరకు దానికి రోగం పెర్గిపోయింది. ఇగ మాఊర్లె రంగాశార్లదగ్గర వైద్గంజేయించిన. ఓ, ఒగ కత గాదయ్యా కడుపులనొప్పని సుడిబెట్టుకబోయేది. గప్పుడు రంగాశార్లు రసాలుపోశిండు. ఆకుల్నూరి పట్టీలేశిండు. ఉప్పుబుక్కిచ్చిండు. గిట్నే రొన్నెల్లు వైద్గంజేశిండు- ఈసమెత్తు రోగంగూడబోలే. గప్పుడు నేనే పెద్దేవరకు కొలుపుజేయిచ్చిన. నాదగ్గెరున్న దాంట్లకెల్లి పెద్దపొడేల్ను బలిచ్చిన. ఉఁ....ఉఁ.... రోగందిగ్గలే. గా పొడేల్ను కటికోడు మున్నూరుకడుగుకెగూడ ఇయ్యలే. గిప్పుడు నా పెండ్లం పానంమీదికచ్చిందని బలిచ్చిన. దానిపానంపొయిందిగని దీనిపానంబాగ్గాలే. పెద్దేవర పొడేల్నుమింగి విమ్మలంగకూసున్నది. గదానిమాంసం మా సుట్టాలంత లొట్టలుగొట్టుకుంట తిన్నరు. కుత్తెల దాక కల్దాగి ఎగిరుండ్రి- "సీయక్క బుచ్చన్నో జోర్‌దార్ గున్నదే శియ్యకూర" అన్నరు. నేను, నాయాల్దిమాత్రిం గట్నే ఇశారంగ కూసున్నం- రొండ్రోజ్రీజులుండి సుట్టపక్కాలంత పోయినంక కోమటోడు "దుకాండ్ల పద్దు ఎక్కువైందిరో వారీ !" అనుకుంట బాకికిందికి, గొర్రెపిల్లను దొల్కపోయిండు- పొమ్మబామె శనిజుట్కునె అన్నట్టయింది నాపని.

గిన్నిజేశినాగూడ నాపెండ్లంమాత్రం నొప్పితోటి బాదపడుతనే ఉన్నది "వాయ్యో వామ్మో ఇగనేంజత్త"అని ఒర్రితనే ఉన్నది. నాకు ఎటుసమజ్‌గాలే- దాని బాద జూత్తాంటె నాకు తిక్కతిక్కగున్నది- "సీయక్క పెండ్లాంపానం నయంజేయించని గొల్లోడెందుకుర ఉండి ?" అనుకున్న- ఎడమశెయ్యెత్తి బుర్రిమీసాలు బిరబిర వడి బెట్టిన- కనిగంతల్నే మల్ల కాళ్లిచ్చినట్టయి కూసున్న- దాన్ని దావుకానకు తీస్కపోవాల్నంటె ఎన్నిపైసలుగావాల్నో దెల్వలే- ఎన్నైతేందిగని కా వా లె గ ద- మరెక్కన్నుంచత్తయి ? నాగ్గిన్నన్ని గొర్లున్నయిగద- గవన్ని అమ్ముకోనైనసరే పోదమనుకున్న- మరి గాయింత అమ్ముకబొబ్బుతె తర్వాతబతుకుడెట్ల ? ఇగసంత తర్వాత. ఆపతికాలంల ఆలోచనశేస్కుంట కూసుంటె అంతఅయిపోద్ది- నేను గిట్ల ఆలోశిచ్చుకుంటాంటె రంగాశార్లచ్చిండు.

834

"అయ్యవారూ, రోగంతీరు రోగందేనాయె మీ మందు తొవ్వమందుదేనాయె ఏమన్న ఫాయిదవున్నదా చెప్పుండ్లి"అన్న. గప్పుడా అయ్యోరోడు నక్కోలె ఇగిలిచ్చిండు- "అరే ఓర్వారీ! రోగంగాని ఏదిగాని ఎప్పుడుతగ్గాల్నో అప్పుడు పోద్దిగని నేను పొమ్మంటె పోద్దారా?" అన్నడు- గిదెక్కడికతరో! "మరింగ నీ మందులెందుకు బాంచెను" అన్న నేను.

"మానవ ప్రియత్నంరా పిచ్చిముండకొడుక! మనపని మనం జేస్తాంటె దాని కాలానికదిబోద్ది" అన్నడు వాడు- నాకు శిర్రెత్తింది- నీయక్క సకలావస్తలు జుట్టుకోని నేను బాదలుపడ్తాంటె బాపనోడు దర్మశాత్రిలు జెప్పుతుంట జేరిండు అనుకున్న.

"అయ్య, మరి పెద్దావుకానకు తీస్కపోనా?" అనడిగిన- "అఁ" అని ఇచ్చెంత్రి పడి మొకం శిట శిట లాడిచ్చిండు రంగశార్లు- "అరేయ్ ఎర్రిగొల్లోడ! నాకు ఆంజనేయస్వామిసిద్ది ఉన్నదని తెల్వదారనీకు! రోగం నిముశంల బోడగొడ్తుగని ఇది నిక్కంగ రోగంగాదురా కొంత పాపఫలం ఉన్నది- అది అనుబవించనిదే శమనం గాదురా" అన్నడు. నొప్పచ్చి మిడుకుతాంటె పాపం అంటదేందిరో వీడో! నీయక్క వీన్తోటేందగని "దావుకానకు తీస్కపోతనుండ్లి"అన్న గట్టిగనే- రంగశార్లు ఒగమానంగ నా మొకంజూశి "సరెబిడ్డ; గన్ని పైసలు నీకాడవున్నప్పుడు నేనేమంట. కొత్తలు ముల ముల బెడ్తానయినీకు" అన్నడు- "అగ్గొ గాపైసలే లెవ్వండ్లి! పైసలుండికాదు- పానం కోసం ఇశారం" అన్న నేను. "ఏందిరో పిచ్చిగిట్ల లేశినాదిర! కొత్తకాని గూడ లేదంటవు, దావుకానకేస్క పోతనంటవు ఏందిర నీకత?" అని మల్లఅన్నడు "ఏమన్న అమ్ముతావుర పైసలకోసం?"

"తప్పతాది బాంచెను, మీఅసొంటి పెద్దల దయుంటె" అన్న నేను- గీమాటల ఏమున్నదో నాకర్దంగాలేగని అయ్యోరోనికి కోపమచ్చింది అరుగుమీంచిలేశి ముడ్డి దులుపుకుంట సక్కగబొయిండు- నేను గక్కన్నే పోటుగర్రికు ఆనుకోనికూసున్న "ఎట్లనన్నా! ఏదన్న అమ్ముదామంటె ఎండిబంగారాలు అయిపాయె- ఇన్నాల్లు పానమోలెసాదిన గొర్రెజీవాల్దప్ప ఇంకేంలెవ్వు! ఇప్పుడు పుసుక్కున అమ్ముదామంటె పానందరిత్త లేదు- అవుసరాని కమ్ముతె అడ్డికి పావుశేరుఅడుగుతరు- గాతర్వాత అడుక్కతినాలె- ఇంగెట్లజేద్దురా నారాయినా బగమంతుడా" అని ఇశారంజేస్తుండంగ నాపెండ్లం నొప్పెక్కువైపోయి గొంగట్ల బొర్లుకుంట కొండ కీకెలు బెడ్తాంది- నేను ఆబరత్తంగ దాన్దగ్గరికిపోయి "ఏందె, ఏందె" అనుకుంట దాన్ని గట్టిగపట్టుకున్న- గది ఎసుమంటి మనిశి? ఈ మూన్నెల్లల్ల ఎండిపోయి వరుగోలె అయింది- దాన్నిజూత్తె నాదుక్కం

835

అగలే- నన్ను అనుకోనికు సోని "ఇగ నావశంగాదు, నేను బత్క-" అని నా మొక మంత ఎండిపొయిన శేతులతోటి పునుకుతాంది- గింతల గాలొల్లికి పక్కింటి రాజవ్వచ్చింది- "ఊకోవె మల్లక్కా! శిన్నపిల్లోలె ఏందెగిది?" అనుకుంట నాపెండ్లాన్ని సముదాయించి నేను ఇగలేశిన- "రాజవ్వ! గిదీన్ని సూస్కుంట ఉండే- నేనుగిప్పుడే ఈడిదాక బొయత్త!" అనిలేశి తలుపుశెక్క-మీది గొంగడిదీశి బుజానఏసుకున్న- "జెప్పునరా" అని రాజవ్వ అంటుండంగనే బయిటికచ్చిన- దబ దబ నడుసుకుంట కొమటి సత్తెయ్య ఇంటిదాక బొయిన- పొయ్యేటాల్లకు కొమటోడు మాదిగముత్తితోని పరాశ్కాలాడుతాండు- గదేమో వీన్ని జూత్తనేలేదు- నేంబోంగనె ఇగిలిచ్చుడు బందుజేశిండు- జెప జెప పొట్లంగట్టి మాదిగముత్తిని ఎల్లగొట్టిండు- "దండాలు బాంచెను" అని గొంగడి కిందేస్కొనికూకున్న- "ఆఁ ఆఁ ఏందిర బుచ్చిగా ఎటోవస్తివి?" అన్నడు కొమటోడు- "ఇంకాడికి? సుకమచ్చినా దుక్కమచ్చినా మీ అసొంటి పెద్దింట్లకేనాయె" అన్న.

"మరిప్పుడు సుకంతోని వస్తివా? దుక్కంతోని వస్తివా?" అని కొమటోడు ఎక ఎక నవ్విండు- నేంగూడ ఎర్రినవ్వు నవ్విన- వాడు చింతపండు బస్తాలిగున్నడు. బొర్రమీనికెల్లి మాశిబోయిన జంజిరం నల్లగ ఏలాడుతాంది- గిట్లసంగతని అంతజెప్పి "పైసలుగావాలె బాంచెను- ఎట్లనన్నజెయిండ్రి ఒక్క- ఇన్నూరుదజాలు" అన్న- గంతలకె వాడు గల్లడబ్బలటుక్కున బందుజేశి "అబ్బో, పైసలాడ ఉన్నయిరా" అన్నడు నాకు గాయింత దెల్వదా? ముంగ్గాల గట్నే అంటడు గని ఆకరుకు వాడు జెప్పిన మిత్తికి ఒప్పిచ్చుకోని మాగ పైసలిత్తడు- గందుకే వదులకుంట "మీరు గాకుంటె ఇగెట్ల!" అన్న బతిమాల్నట్టు- బతిలాడిచ్చుకోని, బతిలాడిచ్చుకోని ఆకరుకు వాదొక్క ఉపాయం జెప్పిండు- నాగొర్రెపిల్లజీవాలన్ని దెచ్చి వానికి తాకటబెడ్తె ఇన్నూరు ఇత్తనన్నడు- నాకు నాకు పపగొర్లున్నయి- గయిదెచ్చి వీనికిచ్చి నేనాడబోవాలె? గీ ఉపాయం నాకెరికే- ఎ....ఏఁ.... ఇచ్చిరొండొర్రోజులు కాంగనే "ఇగదే నాపైసలు" అంటడు- ఎల్లకపోతె మిత్తి పెంచుతడు- గామిత్తిగట్లనే పెరిగి పెరిగి అసలుకుగల్సి ఆకరుకు నీసొత్తుకు, నా రూపాలకు బరాబరైంది అంటడు. గామాటేవాన్తోటి అన్న.

"గట్లయితె మరిపైసలద్దా?" అన్నడు కొమటోడు.

"అట్లయిందానికి మంచిగ పోతతించిన జీవాన్నమ్ముత ఇన్నూరియ్యండ్లి" అన్ననేను.

"గొర్రెపిల్లను నేనేంజేస్కోవాలొ! నువు నేంజెప్పింది మల్లోసారి ఇశారించుకోని రాపో!" అని లేశిఇంట్లకు బొయిండు. నేను అడివిల తొవ్వదప్పిన మ్యాకపిల్లొలె తల్కాయె ఏలాదేసుకోనివచ్చిన.

836

వచ్చేటాల్లకు నా గుడిశెకాడ ఇరుగుపొరుగంత జమయిండ్లు. "మల్లేమయిందిరో" అనుకుంట లోపలికచ్చిన- గాడసాపల నా పెండ్లం పండ్కోనిఉన్నది. దానిడొక్కలు ఎగుర్తానయి- ఊపిరిపీల్చుడు కట్టమైతాంది. "బుచ్చన్నా ఇగనన్న పెద్దావుకానకు తీస్కపోకపోతె మల్లవ్వ మనకుదక్కదే" అన్నదిరాజవ్వ- నాకు గంతలకే కండ్లనీల్లు జొటజొటకారినయి- "యాన్నన్న పైసలకు జూడకపోయినావుర!" ఎంకటిగాడు నా బుజంమీన శెయ్యేసి అన్నడు నాకుమండుకచ్చింది.

"బోడపరాశ్కమాడ్తానావుర! పైసలాడదొర్కుతయి? తెల్వనట్లేజేత్తానవు!" అన్న- ఆయింత ఎంకటిగాడు మొకం శిన్నబుచ్చుకున్నడు- నాకు పెయ్యంత శిటశిట లాడింది- నీయక్క గీడకూసుంటె పనిగాదు మల్ల మంది మాటలంటాంటరు అని మల్లబయల్దేరిన- "యాడికిబోతానవురో నేనత్తాగు"అని ఎంకటిగాడు రాబోయిండు- "లే- లే- నువ్వీన్నేకూసో"అని కుమ్మరిగోవిందు ఇంటిమొకానబొయిన- పట్నం తీస్కపోవాల్నంటె బస్సుమీదపోవాలె- బస్సుతొవ్వకు మావూరు ఎనిమిదిమైల్ల దూరానున్నది- గీ ఆమెడదూరంఎట్లబోవాల్నంటె నడిశిపోవుడే- గిప్పుడునాపెండ్లాం నడిశెటట్టులేదు- బండిగావాలె- గీవూల్లె బండ్లెవ్వనికీలేవు నల్గురికితప్ప- రెడ్డోడు అసలు ఇయ్యనేఇయ్యడు- గవాన్దాక పోవుడుకంటె పెద్దపులినోట్లె తల్కాయెబెట్టుడు మంచిది- పట్వారోనికి వున్నదిగని వాన్నడుగుడు కంటె పాంపుట్టల చెయిసూకుడు మంచిది- కొమటిసత్తిగానికున్నది. గిప్పుడు అప్పేఇయ్యకపాయె బండేడిత్తడు? ఇగవున్నోడు కుమ్మరిగోవిందు- దానిమీద కుండలేస్కోని ఊళ్లూరు దిరుగ్గుంట అమ్ముతడుగాబట్టి ఆయింత వానికొక్కనికున్నది- ఇగఎవ్వనికీలేదు- ఇప్పుడుబండిత్తె గవాడొక్కడేఇయ్యాలె- దబదబ నడ్సుకుంట పొయెటాల్లకు సుల్కతాడు పేనుకుంట కూసున్నడు గోవిందు.

"ఏందేబుచ్చన్నా, మల్లవ్వబాగలేదటగదనే!" అని పల్కరిచ్చిండు.

"ఔనే! గిల్లసంగకున్నది- జరంత నీబండిగావాలె" అన్న.

"గదాన్దేంబాగ్గెం? నువుమల్లరావో- గొడ్లు కుంటకొమ్మున మేయబొయినయి. ఆటిన్నేను తోలుకత్తగని నువు తయారుగుండు" అన్నడు- అమ్మనాయినా! నా పానాలు నిమ్మలమైనయి- గుండెదిట్టంజేస్కోని ఎన్కకుదిర్గిన.

గిదంత నాకునాకే ఇశారంగ, ఇచ్చంత్రింగ ఉన్నది- పట్నంబొయినంక రొండుగొర్లు అమ్మయినాగూడ నా పెండ్లంపానం నయంజేయిచ్చాల్నని అనుకున్న- గీడ కోమటోనికి అమ్ముడుకంటె గక్కడమ్ముడేమంచిది- ఆకరుకు కన్నకొడుకులు,

837

సుట్టాలు, పక్కాలు ఎవలు అక్కెరొచ్చికుంటయిరిగద- మొదట్నుంచి గొర్రెజీవాల నమ్ముకోని బతుకుతుంటి- ఆకరుకు ఇయ్యాలగూడ అవ్వేదిక్కయినయి. మాఅయ్య సచ్చినప్పుడు, అవ్వసచ్చినప్పుడు, నాపెండ్లప్పుడు, కొడుకులు బిడ్డలుపుట్టినప్పుడు, వాల్లపెండ్లిండ్లకు, వాల్లకొడుకులుబుట్టినప్పుడు, ఎప్పుడుజూశినా, సావుల, బతుకుల, సుకంల, దుక్కంల అన్నిటికి గొర్రెజీవాలే దిక్కయినయిగని గీ మనుసులు ఎప్పుడన్న ఆదుకున్నారు? ఊల్లె ఒక్కొక్కనిదగ్గర గింత పైకమున్నది. ఎవడన్న అక్కరకు దగ్గెరికచ్చిండా? నన్నుసూడాన్రిదుండ్రి ఎసువంటిసంసారం ఎట్లయిపాయె- నాదొడ్డి నిండ ఎప్పుడుసూశినా గొర్రెలు, మ్యాకలు మెకమెకలాడుకుంట ఉండేది. ఇమ్నారు గొర్లు, యాబై మ్యాకలు, గవన్నిగిప్పుడెవ్వి? రెడ్డోనిదొడ్లె కొన్నున్నయి కటికోని శేతుల కొన్నిబడ్డయి. గదేమరిగమ్మతు! నాకుపండ్గకు, పబ్బానికి అవసరమైతెనో, బియ్యపుగింజల్లేకుంటెనో ఉన్నగొర్రెలు మ్యాకలు అమ్ముకదొబ్బిన. గదే పట్వారోనింట్ల బిడ్డపెండ్లయితె నేను పున్యానికి గొర్రెపిల్లనిచ్చిన- కాపోల్లసమ్మయ్య తోట్ల పండిన కూరగాయల్దెచ్చి ఇచ్చిండు- కోమటోడు అయిదుపీశెల నెయ్యిపోశిండు. రైతులంతగల్సి పందుంవడ్లు జమజేశిచ్చిండ్లు. ఎట్టిశాకిరికి సాకలిఇస్తారిగాడు, మంగలి సోమడు, ఎలోడు ఉండనేఉండిరి. వానికార్యమేమొ గప్లెల్లిపోద్ది. నా అనుమంటోని కేమొ గితిప్పలు. నీయక్కదేశం....

గిట్ల ఇశారం జేసుకుంట మల్ల గుడిశెదాకవొయిన- గొడ ఒగలొల్లిగాదు. మా రాజవ్వ, చినమల్లి, బుచ్చిరాము, కొమిరి నాపెండ్లం దగ్గెర కూకోని తీకనాలుతీత్తాండ్రి. నాకు కిందికెల్లి మండుకచ్చింది.

"గిదెక్కడి కతరో! ఉన్నగి పైసంతయితె పదిరూపాలు జేత్తాండ్రి మంది" అనుకున్న.

"దూశ్.... లేవ్రి! అగమాగం జేత్తాండ్రి అంత- ఏమైంధిపుడు? బండి మాట్లాడుకచ్చిన- ఇగ పట్నంతీస్కపోత- అడ దన్వంతరసొంటి వైదుగులున్నరు- ఇంజేషనిచ్చిరాంటె మల్ల ఎమదర్మరాజసొంటోడు తీస్కపొయ్యేపానాలు వదిలిపెట్టి పోవాలె-" అని నవ్వుకుంట సెమత్కారంగ అన్నట్టుఅన్న- అన్నగని గామాటల్ల దైర్నంలేదు- ఏ-ఏంలేదురవ్రి అని అనిపిచ్చాలన్ని వట్టిగనే అన్న- కని అన్ని గాలి మాటలోలిగున్నయి మా బుచ్చిరామికి గామాటలకు కోపమచ్చినట్టున్నది నన్నుకోశి పారేశెటట్టు సూశింది.

“తూ.... నీయవ్వ మొండి గుండెల ముండకొడుక ! మనిషి సావుబాదలపడ్తాంటె ఇగిలిచ్చుకుంట మాట్లాడెటానికి శిగ్గులేదు- మల్ల బండిమాట్లాడు కచ్చినంటాండు- ఈ దేశముకు కోసం ఎవలో ఇత్తరటబండి.... బోయిఉన్నోడు గిట్లనేవుంటాడు ?” అన్నది నాకు మాశికాకయిపోయింది. “నీయక్క లొల్లి....” అనుకున్న- గింతలకె గోలెం ఈశిగాడచ్చిండు వాడు దానిమొగడే “నీతల్లి.... నోర్మూయ్యే నువ్వు ! బండనంగనె దొర్కుతదనుకుంటానవ ? ఈ పూల్లె బండున్నోడు ఎవడే ! ఎవన్నో ఆముదంబెట్టి గీకాలె- గప్పుడు అది రావాలె- పున్యానికే అత్తాదిబండి ? బండి దెమ్మడంటె పెరట్ల శిక్కుడుగాయలు దెంపుడనుకుంటానవ ?” అన్నడు- గంతట్లనె అదినోరుమూసుకున్నది- నేను గక్కన్నే అరుగుపైనకూసుండి సుట్టముట్టిచ్చుకున్న- గుప్పు గుప్పు పొగడుత్తాంటె గాపొగ సాయలకెల్లి నాయిల్లు, నాపెండ్లం, మంది అందరూ మస్కమస్కోలె కన్పిత్తాద్రు- నాశిన్నప్పుడు, దేశసంచారం జేస్కుంట బాపనాయినె ఒగాయినె వచ్చిండు- గాయినె “బిడ్డా ! గీలోకమంత వట్టిమాయలోకంరా- నీగ్గనపడేదంత నిజంగాదు. నిజమనేది ఒక సత్తెపదార్తం. దానినీడలు ఈ లోకంల మనకు కండ్లకెదురుంగ కనిపిస్తయి- అసలు సత్తెం వేరేవుంటది- గది మనగ్గనపడది- గదాన్ని జూడాల్నంటె మోచ్చం పొందాలె- మోచ్చం పొందుడంటె ఏందనుకుంటానవు పరాశ్కంగాదు” అన్నడు- నాగ్గీసంగతి అంతుతేల్వుకోవాల్ననిపిచ్చింది “మరిగనాకు మోచ్చమార్గం జెప్పుండ్రి బాంచెను” అన్న- గప్పుడాయినె ఒగ మంత్రిం జెప్పిండు- గదేందో గమ్మతుగున్నది- నాకునోరేతిర్గలే- “సామీ ! గిట్లనాతోనిగాదు- ఏదన్న సులువుమార్గం జెప్పుండ్రి” అన్న- గప్పుడాయినె ఇగ ఆలోశిచ్చిండు- ఆలోశిచ్చి ఆలోశిచ్చి ఆకరుకు “బిడ్డా ! నీకు సంస్కృతమంత్రాలు రావురా ! నీకు అలుకగ ఉండేది ఒగటిజెప్త ఇను” అని గిట్లజెప్పిండు. “బొల్లిగద్ద నాసామి ! కాపాడరావయ్యా” బొల్లిగద్ద అంటె గరుత్మంతుడు గదానిపీనెక్కెటోడు నారాయినమూర్తి- గాయినెను తల్సుకునుడన్నమాట- “నీకష్టకాలమచ్చినప్పుడు గీ మంత్రిం సదువుకోర !” అన్నడు ఇరుసవడ్లు, ముంతెడునెయ్యి గీరెండు మాటలు జెప్పినందుకే దొబ్బిపోయిండు- “కార్తీకమాసంల సలిబెడ్తది ఒక గొంగడియ్యరా” అని అదొకటి ఏస్కోనిపోయిండు.

ఇగ గాతర్వాత నాకెన్నెన్నో కష్టాలచ్చినయి- గప్పుడు గామంత్రిం ఒగ సదువుడు సదువలే ఇగ- కష్టందీరుడు అటుబోయి ఉన్న జాయిదాతు అంత పోలెగని కష్టాలు దీరలే- “నీతల్లి ...” అనుకోని ఆమంత్రిం వదిలిపెట్టిన- ఆపదలచ్చి మీనగూకుంటె మంత్రిం జదువుతెపోద్దా ? గప్పట్నుంచి గీమంత్రాలు దేవతలు అందర్నీ అదిలిపెట్టి కూకున్న- మొన్న పెద్దేవర కొలుపెందుకు జేశిన అంటె గింతంత ఆశ ఏన్నో సుక్కోలె

నాలోపల ఎలుగుతాండె- నీయక్క- గొర్రెపోతు వోతె పామెగని పెండ్లంకంటెక్కువా? అనుకున్న- అదిగూడ దీరిపొయింది- దేవతలేమన్న వైద్గులా రోగంనయంజేశెటానికి! అన్నందింటె ఆకలివోద్ది. మందేత్తె రోగంబోద్ది గంతేముచ్చట- అండ్ల ఇశారంజేశె టానికేమున్నది! గిట్ల ఆలోశనజేస్కుంట కూకుండెటాల్లకు పుట్టఅయిపొయింది- ఆదటుదిక్కు- పొర్నాకి "ఉశ్శో" అనుకుంట లేశినిలబడ్డ- సుట్టాతజూశిన- మంది అంత తలోమాట వాల్లల్ల వాల్లే మాట్లాడుకుంట నాదిక్కుజూత్తాండ్రు- గోలెం ఈరిగాడు నాదగ్గరికచ్చి "ఓో- వోరాదే జెప్పవబొయి ఎవన్నడిగినవో బండిదేరాదు!" అన్నడు.

"అవ్వర! కుమ్మరి గోవిందు ఇంటిదాకవొయ్యత్తరా! బండిత్తనన్నడు పట్కరత్త"అని బైల్దేరిన.

"ఆఁ ఆఁ జెల్దిబొయిరా- ఆలిసెంజేత్తె అపాయమైతంది" అన్నడువాడు. నేను నా పెండ్లాన్ని జూశిన. మైకంగమ్మినదానోలగనే పండ్కొనిఉన్నదది. "గిదేందిరో! ఉన్నదా ఊశిందా?" అనుకుంట దానిపెయిముట్టుకున్న. రాజవ్వ కసిరిచ్చికొట్టింది. గిట్లనే నువ్వు సూస్కుంటజేరుతె అదినిజంగనె సచ్చివోద్ది" అన్నది. నేనులేశి దబదబ బయటి కచ్చిన. బువ్వల్దినేయాల్ల దాటింది. ఊల్లెఅంత సప్పుడులేకుంటనే ఉన్నది. ఐనా గీయాల్లకెవడుంటడు! మల్ల శీకటైదెటప్పుడుగని రారు. బజారువొంట శెట్లనీడున్నకాడ పొల్లగాండ్లు బొంగురాలాటలు, బచ్చాలాటలు ఆడుతాండ్లు, కొందరువోరగాండ్లు ఊశెకెల గుడ్డేలుగులు పడుతాండ్లు. కాపోల్ల కిష్టయ్యపెరట్ల కొందరు పొల్లగాండ్లు శింత కాయలు కొట్టుకతింటాండ్లు. గ వోరగాల్లను సూశెటాల్లకు నాకు నా శిన్నతనం యాది కచ్చింది. ఎంత ముద్దుగుండేటియి గారోజులు గిట్లనే ఆటలాడేది. ఈతలుగొట్టేది. గసుమంటి రోజులన్ని పొయినయి. నేను సంసారంలబడి గిన్నితిప్పల్లుపడబడ్తిని.

గింతట్లకె కోమటోని దుకానమచ్చింది. గౌండ్ల యాదమ్మతోని పరాశ్కమాడు కుంట కోమటోడు నాదిక్కుసూశి "యాడికిబోతానవురో!" అన్నడు. "గిడికే"అన్న నేను అగకుంటనే- "మంచిది మంచిది పొయిరా!" అన్నడువాడు ఎటకారంగ నవ్వు కుంట నేనాడికిబోతె గీపిసికెందుకు అనుకున్న. "నీయక్క.... గొల్లోనిబతుకెంత అవ్వాన్నమై పొయిందిరో" అని దుమాలదీసి మొకంతుడ్సుకున్న.

ఎండ శిటమటలాడ్తాంది- నాకు గుండెలు గుబగుబలాడ్తానయి- నాపెండ్లాం నలభై సంవత్సరాలకెల్లి నాతోటి కట్టసుకాలల్ల పాలుబంచుకుంటాంది- నేనేడిత్తె దాని కండ్లల్లగూడ నీల్లు గిర్రగిర్ర తిర్గుతయి- నేన్నవ్వితె దానిమొకంగూడ పెద్దగొంగడంత యిప్పుకుంటది- గసుమంటిదానికి పానాంతుకమైతె ఏంజెయ్యలేకవోతిని. శీ- నీయక్క....

840

గిట్ల ఆలోశనజేస్కుంట పోయెటాల్లకు కుమ్మరిగోవిందు సావట్లగూసోని శిన్న కొడ్కును ఓల్లె గూకోబెట్కోని "గింతంత బాగురబిడ్డ! ఒక్కబుక్కపీలువు, ఏం గాదురా మంచిగుంటది"అని సుట్టఅందిత్తాండు- గాశిన్నపోరడు "ఊఁ ఏవఁద్దే"అని మొకం దిప్పుకుంటాండు. నన్నుజూడంగనె పిలగాన్ని ఓల్లెకెల్లిదించి "రాయే, కూసో!" అని అరుగు సూపెట్టిండు- "అబ్బో! కూకునేటట్టు యాడున్నది జెప్పన బండిదోల్క పోవాలె" అన్న.

"పోదువుగని కూసో" అన్నడు గోవిందు.

"లే.లే. పోవాలె- దానికి పరీశాన్‌గున్నది"అని అట్లనే నిలబడి అటిటుజూశిన- గొడ్లు యాడగనబడలే- బండిమాత్రం ఆన్నేఉన్నది- "ఎడ్లెవ్వి? తోలుకరాలే!" అన్న.

గోవిందు నాదిక్కు శిగ్గుపడుకుంట సూశిండు- "ఆఁ పొయినగని ఎడ్లులెవ్వఆడ" అన్నడు.

"అదె?" అన్న ఏందోవున్నదిరకతో అనుకుంటనే.

"ఇగో బుచ్చన్న! పెద్దోల్లతోటియవ్వారం! మనం మనం సదురుకుంటంగని వానితోని పెట్టుకోజాలుతమా!" అన్నడు గోవిందు.

"ఎవన్తోటిరో?"

"గదే కోమటోనితోటి! వానిగ్గిప్పుడే పట్నంబొయ్యే పనున్నదట- వాని వడ్ల బత్తాలు మార్కెటుకేస్కబోవాల్నట, బండెడ్లడిగిండు" అన్నడు గోవిందు తలకాయె వంచుకోని.

"వానిబండిబోంగ ఇదిగూడా గావాల్నటనా?"

"అవునట!"

వానిగొంతు వనికింది.

నాకు కాల్లకిందిబూమి కదిలినట్టనిపిచ్చింది. "అంటె గిప్పుడెట్ల బండిలేకుంటె మరి? నాకిత్తనంటివిగద!" అన్ననిర్వంగ.

నేనేంజెయ్యాలెజెప్పు! కోమటోనికి కొత్తలుబాకివుంటి. ఎడ్లుబండియ్యకుంటె అవిదెమ్మనికూసుంటడు. పైసలియ్యాల్నంటె ఏదన్న తెగనమ్మాలె. పోనీఅవిఆన్తోటి పంచాతిపెట్టుకుంటె రేపేయాల్ల ఎట్లుంటదో. గివన్ని అయ్యేపనులేనాజెప్పు? గోవిందు ఎటోసూస్కుంటఅన్నడు. నాకు కోపమచ్చింది- ఇశారమైంది. ఉద్దిరేకం పెరిగిపెయింది- ఐనగూడ అనుసుకోనిఅన్న.

841

"మరిగ ఎట్ల? బండికావాలెగదనాకు! దొపకదంటవా?"

"ఏంజెయ్యమంటవు కత గిట్లున్నది- నీకేమొ ఇయబుద్దైతాంది- కోమటోన్తోని పంచాతైద్ద నిబయమైతాంది" అన్నడు గోవిందు. నాకీగకోపమాగలే బుస్సున తాసు బామ్మొగ్గె లేశిన. "అవురార్రి! మీరంత వానిశేతికింద బతుకుతారుర్రి. వాడు సోలెడు పప్పు మానెడుబియ్యం ఇత్తె బతికెటోల్లుగాదుర మీరు! వానిమాటినక నాకష్టసుకాలు సూత్తారార్రి! నా అవుసరానికాదుకుంటారర్రి! నేనుకూడ మీవోల్లగనే బతికెటోన్నిరా! మీతోటోన్నిరా! నాపెండ్లం సావుబతుకుల్లున్నది. గదానికేమొ బండియ్య శాతగాదు, వాని అడ్లు మూర్కెటుకేస్కపొయెటాన్కి ఇత్తరార్రి! గావడ్లన్ని యాడియిరా వానికి? గది ఆలోశించినారర్రి? వాడు జెప్పినట్టినకపోతె రెడ్డోన్తోని, పట్వారోన్తోని జెప్పి మీ బతుకుల అగ్గిరేపుతడువాడు. కని గిదెంతదూరంపోద్దో ఎర్కేనార? గిసుమంటికాలం నీకుగూడ అత్తదిరా! గప్పుడు నీమీద పేర్మజూపెట్టే కోమటోడు ఏంజెయ్యడురా! గప్పుడు గీగొల్లబుచ్చిగాని మాటలు నీకు యాదికత్తయిరా! సూస్కో-ఇదేవామాట-శిలాచ్ఛరం - శిలాచ్ఛరం రా అరేయ్" అని శాపనార్దాలుపెట్టిన. గివన్ని నేను కడు పుబ్బురంతోటి అన్నయిగాదు. నిజంగ నాకడుపులకెల్లి అగ్గినిప్పులోలె దుంక్నయి. మనుసుల జెకముకి గొట్టినట్టయితాంది. ఇంగ ఏం మాట్లాడకుండ ఎన్కకుదిర్గి బిర బిర నడ్సుకుంట నాఇంటిమొకంబట్టిన.

కోమటోని దుకానం ముందటికెల్లిబోతాంటె ఆడు పండ్లిగిలిచ్చుకుంట "ఏమిర బుచ్చిగా! ఆగమాగం బోతానవు?" అన్నడు.

నాకు పెయిమీదదెల్వలే. "థూ! అరేయి నామూలకోమటోడ! నామొకం ముందట ఏదన్న జేపెదైర్నం ఉన్నాదిర నీకు? నీకు గౌరెర్రిపిల్లలమ్మలేదని గింత కైలాటుకం జేత్తావుర? గిదింతోటి ఏమైద్దిరా? నాకు తిక్కరేగిందాంటే గౌర్రితిత్తి దీసినట్టు దీత్తబిడ్డ!........" ఇంకేమందునో గని గంతట్లకే గోవిందు ఉర్కచ్చిండు- "బుచ్చన్న! అగాగు గట్లమాట్లాడ్తె ఎట్లనే? జరఎన్కముందు జూస్కోవాలె" అన్నడు

"నా యెన్కనేవత్తానావుర, పిరికిగాడ్దికొడ్క! నీ అసుమంటోల్లు ఉండె పట్టె నేరా గీపీల్లు తెగాంచేది. శీ! నియ్యత్‌లేని బతుకులార్రిమీయి. ఎవడునాకుసాకారం జెయ్యకపోతె సత్తననుకున్నారర్రి!" మండుకుంట అన్న. గోవిందు మొకంమాడ్సు కున్నడు. "సరెబిడ్డ! వస్త" అని నాయింటి దిక్కుపోయిన.

నా గుడిశెకాడికి పోంగనే అందరు గిరుక్కున తిరిగి సూశిండ్రు. నాకు కండ్లల్ల నీల్లుదిర్గుడు బందయి నిప్పులు దున్కుతానయి. అందర్ని ఇగ గురుకాయించి సూశిన. నాపెండ్లం గట్లనే బొంతలపండి మూలుగుతాంది. అందరు మంది సుట్టుజేరి ఉన్నరు.

842

"ఏందురో! అర్సెటోడుగాదు తీర్సెటోడుగాదుగని పొద్దుకు పదిసార్లడిగెటోడని మీసంగతేంది? పెండ్లం గిట్లుంటె గిపీడు గింత తీర్పాటంగ తిర్గుతాండని సూత్తారో?

నేను పేదోన్నిరా, నాకెవడు సాయంజేత్తదారో? నేంజత్తాంటె సూశిసంబుర పడెటోల్లున్నరో! నారగుతం నీరై పోతాంటె దాంట్ల పంటలు పండిచ్చుకునెటోల్లున్నరో! నా అక్కెర పానంమీది కచ్చినంక ఉన్నజాయిదాతంత పున్యానికి దొబ్బెటానికి సూశెటోల్లున్నరో! నేను అరిగోస పడ్తాంటె బాగోతం సూశినట్టు సూశెటోల్లున్నరో, అరేయి గోలెం ఈరిగా, నాపెండ్లం ఎసుమంటిదిరా! గోవుమాలచ్చిమికంటె దాని మనుసు సుతారంరా! అది ఎందరి బిడ్డలను కన్నబిడ్డలోలిగె సూసుకున్నదిరా! ఊల్లె ఎవనిపిల్లల కేమచ్చినా ఇదక్కడికి తయారై ఎళ్లసూసుకున్నదిరా? ఎన్నివైద్గాలు జేశిందిరా, ఎందరి ఇండ్లల్ల పెండ్లిల్లయితాంటె ఎన్ని శావలు జేశిందిరా, గసుమంటిది గియాలగిట్లున్నదంటె ఎవడన్న ఒక్కడుసాయం జేత్తాండా? ఆకరుకు బండిత్తనన్నోడు గూడ కోమటోనికి బయపడి తెడ్డుజూపెట్టిండు. వానింట్ల-గదే గాకోమటోనింట్ల గిదెన్ని పనులు జేశిందిరా! గదివాడు ఇయ్యాల మర్శిపోవచ్చుగని వారీ! నేన్దానిమొగన్నిరా, కట్టుకున్నోన్నిరా! దాని బాగోగులు సూశెదర్మం నామీదున్నదిరా.

అరేయ్- గిదంతసూత్తాంటె నాకు ఈరబద్రుడు పూన్తాండు- శివాలెత్తుతానయి- ఎల్లెల్లెల్లె........... అరేయి ఎవ్వడు వానిసుకమే సూస్కోనీరా, కనివారీ మీరంతా నావోల్లే! గదేనాకుబలంరా! అరేయి నన్ను ఏందోజెయ్యాల్నని పెద్దింటోడు నాకు బండియ్యనియకుండ జేశిండు- గదేంజేత్తదిరానన్ను? నాకింక నా బుజాలల్ల సత్తువ బోలే. బండిలేకుంటేందిరా ఆమెడదూరం దాన్ని బుజాలమీన మోస్కపోత. రెండు గొర్లమ్మి వైద్గంజేయిత్త. అరేయి నాకష్టకాలంల మీరన్న కంటడిబెట్టిండ్రు సాలు బిడ్డా గయింతసాలు. గదేరానాబలం- గదేరా నాసత్తువ." అని పెయిమీద దెల్వకుంట పోయి రెండుగొర్లుఇప్పి తాడుగట్టి చేతులబట్టుకున్న. నాపెండ్లందగ్గరికచ్చి దాన్ని ఓసారి నిండారసూసుకున్న. "లేర్రి- దూరంజరుగుర్రి"అని అందర్ని దూరంజరిపి బొంతతోటిపాటుగదాన్ని ఎత్తి బుజంమీనఏస్కున్న. గప్పుడునాకు ఏం ఈరావేశం పూనిందోగని ఇంతంత బలంరాలేనాకు. నా పెండ్లాన్ని బుజాలమీనఏస్కోని మావోల్లంత ఎంబడిరాంగ బిరబిరనడ్శిన. గొర్లు నా ఎన్కనే అత్తానయి. ఊరుదాటి నంక మావోల్లంత పొలాఃల్ల ఆగిపొయిండ్రు నేనుమాత్రం గదేఃదుకతోటి ముంగలికి నడ్సుకుంట పొయిన. ఈపుమీన నాపెండ్లం కండ్లల్లనీరు సుక్కలు సుక్కలు పడ్తాంది.

843